# 38

## వెలుగుల జడి విరిసేదెప్పుడు?

**చా**లా కాలం నాటి సంగతి. ఆ రోజుల్లో మధ్య ప్రాచీనదేశాల్లో వొక నవాబుగారు విచిత్రమైన వినోద ప్రదర్శన నొకదాన్ని ఏర్పాటు చేశారు. దానికి రాజబంధువులు, ముఖ్యమైన రాజోద్యోగులు, నవాబుగారి అంతఃపురాంగనలు మాత్రమే ఆహ్వానింపబడ్డారు. తన కూతురును కూడా ఆ ప్రదర్శనానికి అనుమతించారు ప్రభువులు.

మరొక్క నిముషంలో ప్రదర్శన ప్రారంభం కాబోతున్నదనగా నవాబుగారు కూతురువైపు చూసారు. చూస్తూనే ఆశ్చర్యపోయారు. అవమానంతో కోపంతో కుతకుతలాడిపోయారు. వారి కళ్ళు చింత నిప్పులను రాల్చాయి. తమ స్త్రీలను ఈ ప్రదర్శనానికి పిలవడమే తప్పు. పిలిచిన నేరానికి నలుగురిలో తన్నిలా సిగ్గుపడేలాగా చేయడం మరింత తప్పు. తనిచ్చిన ఈ అవకాశాన్ని వారు ముఖ్యంగా తన కూతురు దుర్వినియోగం చేయడం మహానేరం. తను నవాబు కూతురునన్న జ్ఞానం కూడా లేకుండా ఇంతమందిలోకి ఇలా నగ్నంగా రావడమేమిటి?

నవాబుగారు కూతురుకు కబురుపంపి సరిగ్గా వస్త్రధారణ చేసి రమ్మన్నారు. ఆవిడ నవ్వింది. నవ్వి తను ధరించిన చీర కేసి చూసుకొన్నది. తను నాన్నగారనుకొన్నట్లుగా లేననీ, భారతదేశం నుండి తన కోసం ప్రత్యేకంగా తెప్పించిన చీరను, తను ధరించే వున్నాననీ, ఈ చీర సెనగడొక్కులో వచ్చిన సంగతిని నాన్నగారికి గుర్తు చేయమని ఆవిడన్నది.

ఆ తరువాత నవాబుగారేమన్నారన్నది మనకు ముఖ్యం కాదు. మనకు కావలసిందల్లా ఆనాటి మన చేనేత పారిశ్రామికులు ఎంత పసందైన వస్త్రాలను నేసేవారోనని చైనా యాత్రికులు ఫాహియాన్ మాటల్లో చెప్పాలంటే “గాలితో వస్త్రాలను చేయడం భారతీయ చేనేత కళాకారులకు బాగా తెలుసు”.

మన వీరాస్వామి సరిగ్గా ఈ కోవకు చెందిన వాడే. ఈ సంప్రదాయానికి వారసుడే. తరతరాలుగా ఈ వృత్తిలో పుట్టి, ఇందులోనే పెరిగి కండెల మధ్యనే కన్నుమూసారు. వారెవరూ సుఖపడివుంటారన్న అనుమానం లేశం కూడా తనకు లేదన్నాడు వీరాస్వామి బాధగా.

“నా మట్టుకు నేను మూడు తరాల నుండి చూస్తున్నా మా తాత, పదహారుమూళ్ల ముతక కోకలు, ముతక ధోవతులు నేసేవాడు. ఉత్తరీయాలు, దుప్పట్లు కూడా నేసేవాడు. అలా నేసి నేసి నాడెను ఆడిస్తూనే ఆయన కన్నుమూసాడు. మా నాన్నకు పెద్దనాన్నకు చిన్నాన్నకు ఆయనగారు మిగిల్చిందల్లా రెండే రెండు పాత మగ్గాలు, పెంకులు జారి కూలిపోవడానికి సిద్ధంగా వున్న ఓ పెంకుటిల్లు” అన్నాడు వీరాస్వామి. దరిద్రంతో చెక్కుగట్టిన తన జ్ఞాపకాలమీది బెచ్చికలను మెల్లిగా తొలగదీసికొంటూ, ఆ ముగ్గురన్నదమ్ములకూ వాటాలు కుదరక ఆ ఇంటిని అమ్ముకొన్నారట. తన తండ్రి తననూ తన తమ్ముణ్ణి వెంటేసుకొని బీడీకట్టు వెనగ్గా వున్న పూరింట్లోకి రావడం తనకింకా జ్ఞాపకం వున్నదన్నారు వీరాస్వామి.

“ఆ స్థలం కూడా మాదికాదండీ, సర్కారుది. మా వూరి కరణం గారికి జత ఓ పంచెల చావులిచ్చి అక్కడ పూరిల్లు వేసుకున్నాడు మా నాన్న. మునసబు వెంకట నారాయణగారు కూడా చాలా మంచివారండీ, నాకు లీలగా గుర్తు. ఆయన కావి ధోవతులను కట్టేవాడు. జరీతలగుడ్డ,

నడుముకు కణికెడు లావున వెండి గోపతాడు, బొటెమనవేలు వెడల్పున బంగారం మురుగులు, పంగనామాలు, కిర్రు చెప్పులు పొన్నుకర్ర, బజార్న నడుస్తుంటే జనం అల్లాడి చచ్చేవారండి. తాసీల్దారుతో చెప్పి మా నాన్నకి స్థలం మంజూరు చేయించాడాయన. ఆ పక్కనే అప్పుడో పెద్ద చెరువుండేది, మేము ప్రొద్దుగూకులూ ఆ చెరువలో ఈతకొడుతుండే వాళ్లం'' అన్నాడు వీరాస్వామి కళ్ళు మిలమిలలాడుతుండగా.

వీరాస్వామి బొత్తిగా చదువుకోలేదు. చిన్నతనం నుండి తండ్రితోబాటే పని చేసేవాడు. అతనికి దారం తీయడం మొదలుకొని రంగులద్దడం దాకా అన్ని పనులూ వచ్చు. తన జీవిత కాలంలో కొన్ని వేల జరీ చీరలు నేశాడట. కానీ తన భార్యకు మాత్రం మచ్చుకు ఒక్క జరీ చీరన్నా నేసి పెట్టలేకపోయానన్నాడు.

''ఏం చెయ్యమంటారు చెప్పండి బాబూ? వచ్చే నాలుగు డబ్బులూ పొట్టకే అంతంత మాత్రమయితే ఇంక జరీ చీరెలు, సన్నచీరెలు మాకెలా వస్తాయండీ'' అన్నాడు వీరాస్వామి.

అతనూ, అతని భార్య, ఇద్దరు కూతుళ్ళూ, కొడుకూ కూడా రోజూ గూడలు పడిపోయేలాగా చాకిరీ చేసే వారట. పిల్లలు ఆసుపోస్తే భార్య మగ్గం మీద కూచుంటే, కొడుకు కండెలకు దారం పోస్తే తనేమో నేసిన పంచెల చావుల్నీ, తువ్వాళ్ళనూ, చీరెల్నీ భుజాన వేసుకుని ఊళ్లోకెళ్ళి అయినకాడికి అమ్ముకొచ్చేవాడుట.

''ఒక్కోసారి కిట్టింపు ధరకాన్న తక్కువగా అమ్మేవాణ్ణి. ఏం చేస్తాను చెప్పండి? కొట్లో నాలుగు డబ్బులివ్వాలి. పొయిలో పిల్లి లేవాలి. ఇద్దరు పిల్లలకు పెళ్ళి చేసి పంపడానికి చావు దగ్గరకొచ్చింది'' అన్నాడు వీరాస్వామి. ఎలాగోలా కొడుకును నాలుగో తరగతి దాకా చదివించాడుట. వాడేమో చిన్నప్పుడు బుద్ధిగా ఉన్నా తరువాత ముదనష్టపు సావాసలు మరిగి చెడిపోయాడట. తనేమో కోపమొచ్చి కొట్టాడుట. చెప్పాపెట్టకుండా పారిపోయాడనీ, ఇప్పుడెక్కడున్నాడో కూడా తెలియదని కన్నీళ్ళు పెట్టుకొన్నాడు వీరాస్వామి.

''మంచోడు కానివ్వండి, చెడ్డోడు కానివ్వండి. ఓ కొడుకు వున్నదారి వేరు బాబూ, కూతుళ్లున్నారనుకోండి వాళ్ళు మంచోళ్ళే అయినా అల్లుళ్ళు దగ్గరకు రానివ్వాలిగా బాబూ'' అన్నాడు వీరాస్వామి దిగులుగా.

అతను మగ్గం కడిగేసి అయిదారేళ్ళయింది. ఉన్న వూరు కూడా అచ్చిరాలేదు. మకాం ఎత్తేసి ఇక్కడికొచ్చాడు. ఏదో కొపెర్లకు ఎక్కుదామని కాదు గానీ, ఏదో రకంగా బతకలేక పోతామా అన్న ధీమా, ఆత్మవిశ్వాసం.

కొంతకాలం ఇంకో మాస్టర్ వీవర్ దగ్గర కూలి పనిచేశాడు. అది లాభం లేకపోయింది. ఇంటిస్థలం అమ్మగా వచ్చిన నాలుగు డబ్బుల్తో మారు బేరానికి చీరెలు, జాకెట్ గుడ్డలు, పాంటు గుడ్డలు, సుజనీలు అమ్ముతున్నారు.

''కొట్టువాళ్ళ దగ్గర నేను సరుకు కొనుక్కోనండీ, డబ్బును హామీ వుంచి కావలసిన సరుకును పట్టుకొస్తా. కాస్త 'సలీసు రేట్ల కిస్తారనుకోండి. సైకిల్ మీద తిరిగి మారు బేరానికిస్తా. చీరకు 5, 10 మిగుల్తాయి. ఒక్కొరు వొకేసారి రొక్కమిచ్చి కొనుక్కోలేరండి. వాయిదాల మీద యిస్తామంటారు.

అలాంటి చోట్ల కాస్త ఎక్కువ మిగుల్తుందనుకోండి. కానీ బాబూ అప్పుడప్పుడూ మొత్తం గుణ్ణమయిపోతుందండీ. వాళ్ళకేమో ఎక్కడికో బదిలీ అయిందనుకోండి. ఆ పద్దుకాస్తా మునిగిందన్నమాటే. అలాంటివీ అప్పుడప్పుడూ తగుల్తానే వుంటాయండి'' అన్నాడు వీరాస్వామి.

క్రిందటేడుదాకా భార్య కూడా చిల్లర మల్లర పనులు చేస్తుండేదట. ఆరోగ్యం దిగనాసిల్లడం వల్ల తనే యింటిదగ్గర ఉండమన్నాట్ట.

“ఇది గొడవగానే తయారయింది బాబుగారూ. పొద్దుగూకులూ ఆ దేశాలమీద పోయినవాణ్ని తలుచుకొని బెంగపెట్టుకుంటుంది. ఇకనేనైనా వాడుబాగుపడాలని చేయి చేసుకున్నానుగానీ వాడి మీద నాకు కోపం ఎందుకుంటుందండీ?'' అరవై రూపాయలిచ్చి ఓ చిన్నమురికిగదిలో వుంటున్న వీరాస్వామి. ఇంకా ఈ పట్టణ వాతావరణానికి ఇమడలేదు. ఇక్కడి నాగరికతతో సరిపెట్టు కోలేకపోతున్నాడు. ఇంకొద్ది రోజుల్లో షష్ఠిపూర్తి చేసుకోబోతున్నా వీరాస్వామికి బతుకుమీద ఇంకా పట్టుచిక్కలేదు. దినబత్తెం కోసం ఇంకా పాకులాడకా తప్పడం లేదు. ఒక రోజున ఒక రూపాయి డబ్బులు సంపాదించి, ఇంకో రోజున అదే రూపాయి కోసం మండు టెండల్లో మంచు బజారుల్లో కారు చీకట్లలో మసగ వెలుగుల్లో అద్దె సైకిలు అదేపనిగా తొక్కుకుంటూ కేకలు పెట్టుకొంటూ తిరిగే వీరాస్వామి జీవితంలో వెలుగు రవ్వలు విరిసే దెప్పుడు? అతని ముఖాన సంతృప్తి రేఖలు విప్పారేదెప్పుడు?